# శాంత

శ్రీనివాసు

ఆ పరిసరం మిమ్మల్నెవర్నీ ఆకర్షించదు. అలా ఆకర్షించబడేవాళ్లు ఆ చెట్టూ, నేనూ తప్ప ఈ ప్రపంచంలో మరెవరూ లేరు.

ఆకాశం ఎర్రబడుతూన్నప్పుడు, చుట్టూ కనుచూపుమేరలో ఎక్కడా ఎవరూ లేనప్పుడు ఆ పరిసరంమీద నుంచుని చెట్టువైపు తదేకధ్యానంతో చూస్తూంటాను. "ఓహో వచ్చావా?" అన్నట్టు చెట్టు ఒళ్ళంతా ఒక్కదఫా కుదుపుకుని, అవయవాల్ని అల్లల్లాడించుకుని, అలా అలవోకగా అర్ధనిమీలితనేత్రంతో నా వేపు చూస్తుంది.

చూస్తూ ఏదో అనుకుంటూ అలా ఎన్ని రోజులైనా గడపగలం. పరిసరాల నిశ్శబ్దతలో మా మూగభాష లీనమైపోతుంది.

అప్పుడప్పుడు ఆ రావిచెట్టు 'శాంత' గా మారిపోతుంది. చెట్టు చిటారు కొమ్మమీద నుంచుని అప్పుడు శాంత మాట్లాడుతుంది.

"రోజూ ఇక్కడికి కొస్తావెందుకు?"

"నిన్ను చూస్తూంటే నా కెంతో ఆనందం"

"నన్ను చూస్తేనే తప్ప జీవితంలో నీకు ఆనందం లేదా?"

"ఉంటే ఉండొచ్చు, కాని నీకో ప్రత్యేక స్థానం నా హృదయంలో."

ఇదీ నా సమాధానం.

సమాధానం వినీ వినటంతో చిటారుకొమ్మమీద నుంచున్న శాంత చెట్టుకింద తళతళ్లాడుతూన్న నీళ్ళలోకి దూకుతుంది. నీళ్ళమీద నల్లత్రాచుల్లా వికసిస్తూన్న శిరోజాలు.

అంతా ఒక్కక్షణంపాటు. చుట్టూ నీళ్లగలగల తప్ప మరేం వినపడదు. చిటారుకొమ్మమీద పడగ విప్పుతూన్న నల్లత్రాచుతప్ప మరేం కనపడదు. రావిచెట్టు యథాప్రకారం మళ్ళా నా ఎదుట నిలబడుతుంది.

అందుకే రావిచెట్టంటే నా కెంతో ఇష్టం. రోజూ సాయంత్రంవేళ ఆహ్వానిస్తుంది. చెట్టుకిందకు రాగానే హోరుమనే శబ్దంతో నృత్యం చేస్తుంది. నావైపు నవ్వుతూ చూస్తూ, ఇవే పువ్వులనుకో అన్నట్టు మీద ఆకుల్ని రాలుస్తుంది.

చిటారుకొమ్మమీద నల్లత్రాచై కూర్చున్న శాంత చెట్టుదిగి వస్తుంది. అంతే. రోజూ ఇదే దృశ్యం.

నీళ్ళ గలగల తప్ప మరేం వినబడనప్పుడు ఇల్లు చేరుకునేవాణ్ణి. దోవపొడుగునా నన్ను వెంటాడుతూ ఏవో ఆలోచనలు. వాటిలో కొన్నిటికి అర్ధం ఉంటుంది. కొన్నిటికి అర్థం ఉండదు. అర్థంలేని ఆలోచనలే మనిషిని వేధించుకు తింటై. తికమక పెడతై—ఎంచేతనంటే వాటికి సరైన మార్గం కనబడదు కాబట్టి. ఇదే నిత్యం నాలో జరిగే సంఘర్షణ.

శాంత నన్ను గాఢంగా ప్రేమించింది. నక్షత్రాల వెలుతురులో నన్ను కౌగలించుకుంది.

శాంతను విడచి ఒక్కక్షణం వుండలేకపోయాను. శాంతను పెళ్లిచేసుకుని ఆ వూరు విడచి వెళ్ళిపోయాను.

వెళ్లిపోయేటపుడు ఊరి పొలిమేరలో నన్ను చూచి రావిచెట్టు వలవలా ఏడ్చింది.

ఆ దృశ్యం నాకు ఇప్పుడూ గుర్తే. ఆవేళ రావిచెట్టు జుట్టు విరబోసుకున్న రాక్షసిలా కనబడింది.

పదిహేనేళ్ళ తరువాత మళ్లా ఆవూరు వెళ్లాను. ఆశయాలు సఫలీకృతమైనై కాబట్టి మామూలు మనిషినైపోయాను. శాంతవల్ల పొందే ఆనందంలో లీనమైపోయాను. నాకోసం ఈ ప్రపంచంలో ఒకరు విచారిస్తున్నారన్న విషయం గ్రహించలేకపోయాను.

సాయంత్రం ఊరిబైట షికారుకు వెళ్ళానన్నమాటేగాని అక్కడ వెనకటి ఆనందం లేదు. రావిచెట్టు కూలపడిపోయి ఉంది.

నా వొళ్ళంతా వణికిపోయింది. అప్పుడసలు శాంత జ్ఞాపకానికేరాలేదు.

భరించలేకపోయాను. వెనుక ఎవరో పిలిచినట్టనిపించింది. భయపడుతూ ఇల్లు చేరుకున్నాను.

గుమ్మంలో శాంత రావిచెట్టులా కూలిపడిపోయి ఉంది.